# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 03-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఆదివాసీలు, గిరిజనుల అభివృద్ధితోనే దేశం మరింత ముందుకెళ్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ విమానయాన సంస్థలకు, ప్రయాణికులకు పెరిగిన ధరల నుండి రక్షణ కల్పించేందుకు `ATF ధరల స్థిరీకరణ నిధి` ఏర్పాటుకు కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- ❖ ఢిల్లీలోని మాలవీయనగర్ హోటల్‌లో ఈ ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో 21 మంది ప్రాణాలు కోల్పోయారు.
- ❖ కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా డీ.కే. శివకుమార్ ఈరోజు ప్రమాణస్వీకారం చేశారు.
- ❖ దేశవ్యాప్తంగా ఎంపికైన 42 అత్యుత్తమ పంచాయతీలకు కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ జాతీయ పురస్కారాలను ప్రధానం చేశారు.

=================

ఆదివాసీలు, గిరిజనుల అభివృద్ధితోనే దేశం మరింత ముందుకెళ్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు నిర్దిష్ట రోడ్ మ్యాప్ రూపొందించి అమలు చేయాలని రాష్ట్రపతి కోరారు. విజ్ఞాన్ భవన్‌లో ఈరోజు జరిగిన జాతీయ సదస్సులో పాల్గొని ప్రసంగించిన రాష్ట్రపతి.. 'వికసిత్ భారత్-2047' సంకల్పంలో గిరిజనులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

(వాయిస్ 30 సెకన్లు)

అదే వేదిక నుండి బెంగళూరు ఐఐఎస్‌సీ లోని సెంటర్ ఫర్ నానో సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో గిరిజన విద్యార్థుల కోసం సెమికండక్టర్ ఫ్యాబ్రికేషన్ ట్రైనింగ్ సెంటర్ ను, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 75 స్పేస్ ల్యాబ్‌లను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వర్చువల్‌గా ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమమైన కేంద్రమంత్రివర్గం 39 వేల 290 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఆరు ప్రధాన ప్రాజెక్టులకు ఈరోజు ఆమోదం తెలిపింది. ఇందులో ముఖ్యంగా 10 వేల కోట్ల రూపాయల బడ్జెట్ తో విమానయాన రంగానికి ఊరటనిచ్చేలా `ATF ధరల స్థిరీకరణ నిధి` ఏర్పాటుకు ఆమోదం లభించింది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా పెరిగిన విమాన ఇంధన ధరల నుండి విమానయాన సంస్థలకు, ప్రయాణికులకు ఇది రక్షణ కల్పించనుంది. ఢిల్లీ-NCR పరిధిలో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు 9 వేల 585 కోట్ల రూపాయలతో పాత ట్రక్కులు, బస్సుల స్థానంలో కొత్త వాహనాల కొనుగోలు పథకానికి సైతం క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీని కోసం 5 వేల 041 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేయనుంది. సమావేశం అనంతరం కేబినెట్ వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ న్యూఢిల్లీలో పాత్రికేయులకు వెల్లడించారు. రామేశ్వర్ నుండి పారాదీప్ వరకు మొత్తం 163 కిలోమీటర్ల పొడవునా 8 వేల 300 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో కొత్త తీరప్రాంత హైవే నిర్మాణానికి కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. ఇక తెలంగాణలో 7 వేల 597 కోట్ల రూపాయలతో హైవేల విస్తరణకు సైతం కేబినెట్ ఆమోదం లభించిందని అశ్వినీ వైష్ణవ్ వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = =

ఢిల్లీలోని ఒక హోటల్లో ఈ ఉదయం ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. దక్షిణ ఢిల్లీలోని మాలవీయనగర్‌లో మికాసా-ఇన్ హోటల్‌లో జరిగిన ప్రమాదంలో 21 మంది సజీవ దహనమయ్యారు. 35 మందికి పైగా గాయపడ్డారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మికాసా-ఇన్ హోటల్‌లో విదేశీయులు సహా 40 మంది వరకు ఉన్నారని పోలీసులు తెలిపారు. ఉదయం 8 గంటల 50 నిమిషాల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగిందని, సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శకటాలు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారని వెల్లడించారు. 8 ఫైర్ టెండర్ల సహాయంతో మంటలను విజయవంతంగా ఆర్పివేశామని దక్షిణ ఢిల్లీ డీసీపీ అనంత్ మిట్టల్ తెలిపారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఇతర అత్యవసర సహాయక బృందాల సమన్వయంతో 40 మందికి పైగా వ్యక్తులను రక్షించి, వైద్య చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రులకు తరలించినట్లు చెప్పారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ.. అగ్ని ప్రమాదంలో చాలా మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని, ఆత్మీయులను కోల్పోయిన వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని సామాజిక మాధ్యమ పోస్ట్ లో పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 2 లక్షల రూపాయలు.. గాయపడిన వారికి 50 వేల రూపాయల చొప్పున నష్ట పరిహారాన్ని ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = =

కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా డీ.కే. శివకుమార్ ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ భవన్‌లోని గ్లాస్‌హౌస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ డీ.కే. శివకుమార్‌తో ప్రమాణం చేయించారు. అలాగే ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జి.పరమేశ్వర్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఇద్దరితో పాటు మరో 12 మంది శాసనసభ్యులు  మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కేరళం, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులతో పాటూ పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు. 1989 నుండి వరుసగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన డీ కే శివకుమార్ 2023లో జరిగిన ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 135 స్థానాలు దక్కించుకోవడంతో తదనంతరం ఏర్పాటైన ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా సేవలందించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం నానాజీ దేశ్ ముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతత్ పురస్కార్ పేరిట 2025 సంవత్సరానికి గానూ జాతీయ పంచాయతీ పురస్కారాలను ఈరోజు ప్రధానం చేసింది. న్యూఢిల్లో జరిగిన ఈ అవార్డుల ప్రధానోత్సవంలో కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, ఆ శాఖ సహాయ మంత్రి ప్రొఫెసర్ ఎస్. పి. సింగ్ బఘేల్‌తో కలిసి ఈ పురస్కారాలను ప్రధానం చేశారు. క్షేత్రస్థాయి పాలన, గ్రామీణాభివృద్ధి, ప్రజా సేవలను అందించడంలో విశిష్ట కృషి చేసిన 42 పంచాయతీలు ఈ పురస్కారాలు అందుకున్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ కు చెందిన కుప్పం, త్రిపురలోని హరిప్పాడ్ పంచాయతీలు ఉత్తమ బ్లాక్ పంచాయతీలుగా ఎంపికయ్యాయి. ఉత్తమ గ్రామ పంచాయతీలుగా అసోంలోని న్యూనాపం, బీహార్ లోని టెల్కప్, ఉత్తర ప్రదేశ్ లోని బిరహారు తొలి మూడు ర్యాంకుల్లో నిలిచాయి.

= = = = = = = = = = = = = = = = = =

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. బంగారం విక్రయించినట్లు కొన్ని మీడియా సంస్థల్లో వస్తున్న వార్తలను పూర్తిగా ఆర్‌బీఐ ఖండించింది. ప్రస్తుతం తన వద్ద ఉన్న భౌతిక బంగారం నిల్వలు 880.52 టన్నులతో ఎలాంటి మార్పు లేకుండా స్థిరంగా ఉన్నాయని స్పష్టం చేసింది. అధికారిక సమాచారం కోసం ఆర్‌బీఐ ప్రతి నెలా విడుదల చేసే మంత్లీ బులెటిన్‌ను మాత్రమే అనుసరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణ ప్రభావం నుండి తన విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ సుమారు 12 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని విక్రయించిదన్న అసత్య వార్తలు ప్రచారమవడంతో ఆర్‌బీఐ ఈ వివరణ ఇచ్చింది.

= = = = = = = = = = = = = = = = = =

ఆరావళి పర్వత శ్రేణి సరిహద్దుల నిర్ధారణపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నివేదికను స్వతంత్రంగా సమీక్షించేందుకు సుప్రీంకోర్టు ఒక ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ జనరల్ కంచన్ దేవి నేతృత్వం వహిస్తారు. ఈ ఏడాది ఆగస్టు 31లోగా తన నివేదికను సమర్పించాలని కమిటీకి స్పష్టం చేసింది. ఆరావళి పర్యావరణ శ్రేణి పరిరక్షణకు సంబంధించిన కీలక సమస్యలను పరిష్కరించడానికి నిష్పక్షపాత, శాస్త్రీయ అంచనా అవసరమని సుప్రీంకోర్టు పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాలు రానున్న 24 గంటల్లో కేరళం తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. రుతుపవనాల రాక నేపథ్యంలో కేరళం, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో రాబోయే వారం రోజుల పాటు 7 నుండి 20 సెంటీ మీటర్ల మేర భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. అదే విధంగా వాయువ్య, మధ్య, తూర్పు భారతదేశంలో రేపు పిడుగులతో కూడిన వర్షాలు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = =